క్లుప్తంగా

మద్యం మత్తులో వాహనాలు నడపొద్దు



డ్రంకెన్ డ్రైవ్ నిర్వహిస్తున్న ఎస్ఐ మహ్మద్

చిలప్‌చెడ్(నర్సాపూర్): మద్యం మత్తులో వాహనాలు నడిపి ప్రమాదాలు కొని తెచ్చుకోవద్దని ఎస్ఐ మహ్మద్ గౌస్ అన్నారు. మండల కేంద్రం చిలప్‌చెడ్‌లో శనివారం అర్ధరాత్రి ఆయన తన సిబ్బందితో వాహనాల తనిఖీలు, డ్రంకెన్ డ్రైవ్ టెస్టులు చేపట్టారు. మైనర్లు వాహనాలు నడిపితే, వాహనాలు ఇచ్చిన వారిపై చర్య తీసుకుంటామన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం



వీధులను శుభ్రం చేయిస్తున్న సర్పంచ్

చిలప్‌చెడ్(నర్సాపూర్): గ్రామాల్లో పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే గ్రామస్తులు ఆరోగ్యంగా ఉంటారని సర్పంచ్ పరశురాంరెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని అజ్జమర్రి గ్రామ వీధులను పరిశుభ్రం చేయించాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామస్తులు తమ పరిసరాలను శుభ్రం చేసుకోవాలన్నారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతీ ఒక్కరి బాధ్యత అన్నారు.

ముగిసిన రాయిలాపూర్ క్రికెట్ టోర్నమెంట్



బహుమతులతో విజేతలు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని రాయిలాపూర్‌లో యువకులు నిర్వహించిన తాలుకా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం ముగిసింది. మొత్తం క్రికెట్ పోటీల్లో 44 జట్లు పాల్గొనగా, పక్షం రోజులుగా పోటీలు జరిగాయి. కాగా నర్సాపూర్ హాస్టల్ టీం క్రికెట్ జట్టు విన్నర్ కాగా రాయిలాపూర్ జట్టు రన్నర్‌గా నిలిచింది. స్థానిక సర్పంచ్ శేఖులు విన్నర్ జట్టు కెప్టెన్ రాకేశ్‌కు రూ. 21వేలు, రన్నర్ జట్టు కెప్టెన్ నవీన్‌చారికి రూ. 11వేలు నగదు బహుమతి అందజేశారు. మాన్‌ఆఫ్‌ది సిరీస్‌గా సురేష్, మ్యాన్‌ఆఫ్‌ది మ్యాచ్ సాయితో పాటు గెలుపొందిన క్రీడాకారులకు కప్, మెమోంటో బహుమతులు అందజేశారు. క్రికెట్ టోర్నమెంట్ నిర్వాహకులు సుధాకర్, సురేశ్, ప్రవీణ్, శాదుల్లా, నిఖిల్, సాయి, సన్నీ, విష్ణు, కార్తీక్, నవీన్‌చారి తదితరులను సర్పంచ్, గ్రామస్తులు సన్మానించారు.

పెద్దమ్మ ఆలయ నిర్మాణానికి సహకరించాలి



మాట్లాడుతున్న శాఖయ్య

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రం కౌడిపల్లిలో శ్రీపెద్దమ్మతల్లి దేవాలయం నిర్మాణానికి ప్రతీ ఒక్కరూ సహకరించాలని మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు మాటూరి శాఖయ్య తెలిపారు. ఆదివారం కౌడిపల్లిలో ముదిరాజ్ సంఘం గ్రామ అధ్యక్షుడు బుజిరంపేట మల్లేశం అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముదిరాజ్‌లు ఐక్యంగా ఉండి రాజకీయంగా ఎదగాలన్నారు. కౌడిపల్లిలో ముదిరాజ్‌ల కుల దైవం పెద్దమ్మతల్లి దేవాలయం నిర్మాణం చేయాలన్నారు. దీనికోసం ప్రతీ ఒక్కరూ సహకరించాలని తెలిపారు. ఐక్యంగా ఉంటేనే హక్కులను సాధించుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు పాల్గొన్నారు.

క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణించాలి

గజ్వేల్‌రూరల్: క్రీడాపోటీల్లో సత్తా చాటినప్పుడే క్రీడాకారులకు మంచి గుర్తింపు లభిస్తుందని, ఓటమితో నిరాశ చెందకుండా విజయం వైపు అడుగులు వేయాలని గజ్వేల్ మండలం రంగంపేట గ్రామ సర్పంచ్ నడిగొప్పుల నర్సమ్మ పేర్కొన్నారు. గ్రామంలో వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులకు ఆదివారం ఎస్ఎంసీ చైర్మన్ నాగరాజు ఆధ్వర్యంలో క్రీడా దుస్తులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. క్రీడారంగానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నట్లు తెలిపారు. మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో క్రీడాకారులు పాల్గొని తమలోని ప్రతిభను చాటాలని ఆకాంక్షించారు.

ఆలయాల్లో భక్తుల సందడి



కొల్చారం(నర్సాపూర్): జైన మందిరంలో పార్శ్వనాథునికి అభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని తునికి నల్ల పోచమ్మదేవి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఆదివారం వివిధ జిల్లాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారికి దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం ఈఓ మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు శివప్ప, రాజేశ్ అమ్మవారికి అభిషేకం నిర్వహించి, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు అమ్మవారికి బోనాలు తీసి, ఒడిబియ్యం పోసి మొక్కులు తీర్చుకున్నారు. డప్పు చప్పుళ్లతో బోనాలు తీయగా, శివసత్తుల పూనకాలు ఆకట్టుకున్నాయి. పలువురు భక్తులు అమ్మవారికి తలనీలాలు సమర్పించారు. వాహనాలకు సైతం పూజలు చేయించారు. నల్ల పోచమ్మదేవిని నూతన సంవత్సరం సందర్భంగా ఎంపీపీ రాజునాయక్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రామాగౌడ్, మాజీ జెడ్పీటీసీ యాదమ్మ, నాయకులు అమర్‌సింగ్, కిషోర్‌గౌడ్ అమ్మవారిని దర్శించుకున్నారు.కొని ఆలయ జూనియర్ అసిస్టెంట్ వెంకట్‌రెడ్డి, సిబ్బంది భక్తులకు ఇబ్బందులు లేకుండా పర్యవేక్షించారు.

శివ్వంపేట(నర్సాపూర్): నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని ఆదివారం మండలంలోని పలు ఆలయాల్లో భక్తజన సందడి నెలకొంది. సికింద్లాపూర్ లక్ష్మీనర్సింహస్వామి, చాకరిమెట్ల శ్రీ సహకార ఆంజనేయస్వామి, దొంతి వేణుగోపాలస్వామిని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్శించుకొని పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేపట్టి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఈఓలు శ్రీనివాస్, శశిధర్, ఆలయ ఫౌండర్, చైర్మన్ ఆంజనేయశర్మ, ప్రధాన అర్చకులు దేవాదత్తశర్మ, ధనుంజయ్‌శర్మ సిబ్బంది ఉన్నారు.

రేగోడ్(మెదక్): నూతన సంవత్సరం సందర్భంగా మండలంలోని ఆయా గ్రామాల్లో ప్రజలు ఆలయాల్లో ఆదివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. 2023 సంవత్సరం సుఖ సంతోషాలతో ఉంచాలని భక్తులు వేడుకున్నారు. భక్తుల రాకతో దేవాలయాలు సందడిగా మారాయి.

కొల్చారం(నర్సాపూర్): నూతన ఏడాదిని పురస్కరించుకొని మండలంలోని జైన్ మందిర్‌లో ఆదివారం జైన భక్తుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయంలో అర్ధరాత్రి ఒక్క వెయ్యి ఎనిమిది దీపాలతో హారతి కార్యక్రమాన్ని ఉదయం శ్రీ 1008 విఘ్నహర్లేశ్వర్ పార్శ్వనాథ్ దిగంబర్ జైన్ విగ్రహానికి జైన అర్చకుల ఆధ్వర్యంలో అభిషేకం కనుల పండగ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి జైనులు పెద్ద ఎత్తున తరలివచ్చి ఈ పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ సెక్రటరి సుమేత్ జైన్ మాట్లాడుతూ.. శాంతి, అహింసకు ప్రతీకగా పార్శ్వనాథుడు భక్తులకు కొలువై నిలుస్తున్నాడని, జైనులే కాకుండా వివిధ ప్రాంతాల నుంచి మతాలకు అతీతంగా భక్తులు పెద్ద ఎత్తున ఈ కార్యక్రమంలో పాల్గొనడం సంతోషించదగ్గ విషయమన్నారు. భక్తుల సౌకర్యార్థం అన్నదానం ఏర్పాటు చేశారు.



కౌడిపల్లి(నర్సాపూర్): తునికి నల్లపోచమ్మదేవి ఆలయంలో ..



శివ్వంపేట(నర్సాపూర్): ఆంజనేయస్వామికి పూజలు చేస్తున్న అర్చకులు



శివ్వంపేట(నర్సాపూర్): సికింద్లాపూర్ లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో..

ఘనంగా అయ్యప్ప మహా పడిపూజ



చిన్నశంకరంపేట(మెదక్): శబరియాత్రకు బయలుదేరిన స్వాములు



తూప్రాన్: అయ్యప్ప దేవాలయంలో మహా పడిపూజ నిర్వహిస్తున్న దృశ్యం

రామాయంపేట(మెదక్): రామాయంపేటలో అయ్యప్ప స్వామి ఆలయంలో ఆదివారం మున్సిపల్ చైర్మన్, గురు స్వామి జితేందర్‌గౌడ్ నిర్వహించిన మహా పడిపూజలో మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ పుట్టి విజయలక్ష్మి, మార్కెట్ కమిటీ చైర్మన్ సరాపు యాదగిరి, సహకార సంఘం చైర్మన్ బాదే చంద్రం, తదితరులు పాల్గొన్నారు.

తూప్రాన్: పట్టణ సమీపంలోని అయ్యప్ప దేవాలయంలో ఆదివారం గురుస్వామి బజారు రుపేశ్ ఆధ్వర్యంలో మహా పడిపూజ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామికి ప్రత్యేక పూజలతో పాటు 18 మెట్ల పూజ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. మండలంలోని అయ్యప్ప మాలధారణ భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. ఈ పూజ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

శబరిమలకు తరలిన అయ్యప్పస్వాములు

చిన్నశంకరంపేట(మెదక్): మండల కేంద్రానికి చెందిన అయ్యప్పస్వాములు శబరిమల యాత్రకు బయలుదేరారు. ఆదివారం మండల కేంద్రంలోని



రామాయంపేట(మెదక్): పడిపూజలో మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి

అయ్యప్పస్వామి ఆలయం వద్ద గురుస్వాముల ఆధ్వర్యంలో పడిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యప్పకీర్తనలు చేశారు. అనంతరం శబరిమలై యాత్రకు అయ్యప్పస్వాములు బయలుదేరారు. యాత్రకు బయలుదేరిన వారిలో గురుస్వాములు రమేశ్‌గౌడ్, నరేందర్, రంగారావు, సందీప్‌గౌడ్‌లతో పాటు 23 స్వాములు ఇరుమడి ధరించి శబరియాత్రకు బయలుదేరారు. ఈ సందర్భంగా గురుస్వామి రమేశ్‌గౌడ్, లక్ష్మాగౌడ్‌ల ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పట్లోరి మాధవిరాజు, సర్పంచ్ రాజిరెడ్డి, ఆర్ఎస్ఎస్ మండల అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, సర్పంచ్‌లు దయానంద్, లక్ష్మీశంకరయ్య, మంగాదేవి యాదవరావు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్లు పంపిణీ



వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న వెంకటస్వామి, నాయకులు

తూప్రాన్: పట్టణంలోని సాయిబాబా మందిరంలో ఆలయ వ్యవస్థాపకుడు హైకోర్టు సీనియర్ న్యాయవాది డాక్టర్ ఏ.వెంకటస్వామి ఆధ్వర్యంలో నిరుపేదలకు సాయిబాబా మందిరంలో ఆదివారం దుప్పట్లు, దివ్యాంగుడికి ట్రై సైకిల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాళ్లు లేని వారికి స్వచ్ఛంద సంస్థల ద్వారా, కృత్రిమ అవయవాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో చాలి తీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పట్లోరి శ్రీనివాస్ రెడ్డి, బోల్లంపల్లి బాబుల్ రెడ్డి, కొక్కొండ యాదిరెడ్డి, బొంది వెంకట్ గౌడ్, రాజేశ్వరశర్మ, సత్య లింగం, తాటి విఠల్ తదితరులు పాల్గొన్నారు.

దిష్టిబొమ్మ తలపై హెల్మెట్



నర్సాపూర్: హెల్మెట్‌ను ద్విచక్ర వాహనం నడిపే సమయంలో వాహనదారులు ధరించాలని రవాణా శాఖ, పోలీసులు ప్రచారం చేస్తుంటారు. కాగా మండలంలోని మాడాపూర్ రోడ్డు పక్కన ఓ రైతు తన పొలంలో ఏర్పాటు చేసిన దిష్టిబొమ్మ తలపై హెల్మెట్ పెట్టాడు. రోడ్డు వెంట వెళ్లే వాహనదారులు ఆ దిష్టిబొమ్మను చూస్తూ వెళ్తున్నారు.

గోపూజతో సిరి సంపదలు

నంగునూరు(సిద్దిపేట): సకల దేవతలకు నిలయమైన ఆవును పూజిస్తే సిరి, సంపదలకు లోటు ఉండదని పూజారి డింగరి విష్ణుతేజాచార్యులు అన్నారు. ధనుర్మాసోత్సవాల్లో భాగంగా ఆదివారం పాలమాకులలోని వేంకటేశ్వరాలయంలో గోపూజ కార్యక్రమం నిర్వహించారు. ఆవు, దూడను పూలు, పట్టు వస్త్రాలతో ప్రత్యేకంగా అలంకరించి గోప్రదక్షిణ చేశారు. తిరుప్పావై సేవలో భాగంగా 16వ పాశురం పఠించి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆంగ్ల నూతన సంవత్సరాది కావడంతో మహిళలు, భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా గీతామందిర దాతృత్వ సంస్థ ఆధ్వర్యంలో తీర్థప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు.



గోపూజ నిర్వహిస్తున్న భక్తులు

ముత్యంరెడ్డి సేవలు చిరస్మరణీయం



మిరుదొడ్డి(దుబ్బాక): నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



తొగుట(దుబ్బాక): కేక్ కట్‌చేస్తున్న చెరుకు శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు

మిరుదొడ్డి(దుబ్బాక): దుబ్బాక నియోజకవర్గంలో మాజీ మంత్రి స్వర్గీయ చెరుకు ముత్యంరెడ్డి చేసిన సేవలు చిరస్మరణీయంగా నిలిచిపోతాయని సీనియర్ కాంగ్రెస్ నాయకుడు పాతూరి వెంకట స్వామిగౌడ్ అన్నారు. అక్బర్‌పేట-భూంపల్లి మండల కేంద్రంలో మాజీ మంత్రి స్వర్గీయ చెరుకు ముత్యంరెడ్డి జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముత్యంరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చెరుకు ముత్యంరెడ్డి గతంలో దొమ్మాట, ప్రస్తుతం దుబ్బాక నియోజకవర్గంలో శాసన సభ్యుడిగా, మంత్రిగా, అంచనాల కమిటీ చైర్మన్‌గా పదవులు చేపట్టి దుబ్బాకను ఉమ్మడి రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలిపారన్నారు. కూడవెల్లి వాగుపై చెక్ డ్యామ్‌లు నిర్మించి దుబ్బాక ప్రాంత రైతు బాంధవుడిగా నిలిచాడన్నారు. పల్లె పల్లెకూ రోడ్లు, బస్సు సౌకర్యం కల్పించిన ఘనత స్వర్గీయ ముత్యం రెడ్డికే దక్కుతుందని కొనియాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బాలుయాదవ్, నారాయణ, యాదవరెడ్డి, నాగరాజు, సురేందర్‌రెడ్డి, రాజం, అబిద్, సత్యాగౌడ్, చంద్రం, శ్రీనివాస్‌గౌడ్, రాజయ్య, ఎల్లం, ప్రకాశ్, రాజు పాల్గొన్నారు.

తొగుట(దుబ్బాక): రాష్ట్ర మాజీ మంత్రి చెరుకు ముత్యంరెడ్డి జయంతిని కాంగ్రెస్ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జ్ చెరుకు శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని తుక్కాపూర్‌లోని ఆయన వ్యవసాయ క్షేత్రంలో ముత్యంరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా చెరుకు శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. వచ్చే సాధారణ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు కోసం కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని కోరారు. ఈ సందర్భంగా కేక్ కట్‌చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ముత్యంరెడ్డి కుటుంబీకులు, ఐఎన్‌టీయూసీ దుబ్బాక అధక్షుడు బాలమల్లు, కాంగ్రెస్ మండల, ఎస్సీ సెల్ అధ్యక్షులు స్వామి, కృష్ణ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రమాదకరంగా వంతెన

వెల్దుర్తి(తూప్రాన్): మండలంలోని మెల్లూర్ నుంచి కొప్పులపల్లి వైపు వెళ్లే దారిలో ఉన్న వంతెనపై సైడ్ వాల్స్ నిర్మించలేదు. దీంతో ఇరుపక్కల ఎలాంటి రక్షణ చర్యలు చేపట్టకపోవడంతో ప్రమాదకరంగా మారింది. ప్రధాన రహదారి నుంచి మూలమలుపులో ఉన్న వంతెనపై ఆదమరిస్తే వాహనదారులు ప్రమాదానికి గురై కాలువలో పడే పరిస్థితి నెలకొంది. ఈ విషయంలో అధికారులు స్పందించి, ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

వైకుంఠ ఏకాదశికి ఆలయాలు ముస్తాబు

కొల్చారం(నర్సాపూర్): వైకుంఠ ఏకాదశి పర్వదినం సోమవారం ఉండడంతో మండల వ్యాప్తంగా వైష్ణవ దేవాలయాలను ముస్తాబు చేసే కార్యక్రమంలో ఆలయాల నిర్వాహకులు నిమగ్నమయ్యారు. రంగంపేట ప్రసిద్ధ రంగనాయక స్వామి ఆలయం, సంగాయిపేట గ్రామంలోని వెంకటేశ్వరుడి గుట్టకు భక్తులు పెద్ద ఎత్తున తరలిరానున్నారు. వైకుంఠ ఏకాదశి రోజు విష్ణుమూర్తిని ఉత్తర ద్వారం గుండా దర్శనం చేసుకుంటే సకల పాపాలు తొలగి, అష్ట ఐశ్వర్యాలు సిద్ధిస్తాయన్న నానుడితో ఉత్తర ద్వారం గుండా స్వామి వారిని దర్శనం చేసుకొని, పూజా కార్యక్రమాల్లో భక్తులు పాల్గొననున్నారు.

కౌడిపల్లి(నర్సాపూర్): ఈనెల 2న వైకుంఠ ఏకాదశి సందర్భంగా మండలంలోని వెల్మకన్నలోని పురాతన శ్రీరాయగిరి వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఉత్తర ద్వార దర్శనానికి ఏర్పాట్లు పూర్తిచేసినట్లు గ్రామ పురోహితుడు ఉమాశంకరశర్మ, ఇన్‌చార్జ్ సర్పంచ్ కాజీపేట రాజేందర్ ఆలయ భక్త భజన మండల సభ్యులు తెలిపారు. సుమారు నాలుగు వందల సంవత్సరాల చరిత్ర కలిగిన శ్రీరాయగిరి వేంకటేశ్వస్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఉత్తర ద్వార దర్శనం కల్పించేందుకు ఏర్పాట్లు చేశారు.

శివ్వంపేట(నర్సాపూర్): వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఆలయాలు ముస్తాబు అయ్యాయి. ఉమ్మడి జిల్లాలో ప్రసిద్ధి చెందిన చాకరిమెట్ల శ్రీ సహకార ఆంజనేయస్వామి, సికింద్లాపూర్ లక్ష్మీనర్సింహస్వామి, దొంతి వేణుగోపాలస్వామి, కొంతన్‌పల్లిలోని వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో స్వామి వార్లను ఉత్తర ద్వారం నుంచి భక్తులు దర్శించుకునేందుకు సిబ్బంది ఏర్పాట్లు పూర్తి చేశారు. పెద్ద ఎత్తున తరలిరానున్న భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చర్యలు చేపట్టినట్లు ఆలయాల ఈఓలు శ్రీనివాస్, శశిధర్, సిబ్బంది తెలిపారు.

వెల్దుర్తి(తూప్రాన్): తెలంగాణ కాశీగా పేరుగాంచిన మండలంలోని భస్వాపూర్ శ్రీభ్రమరాంబ సహిత మల్లికార్జున స్వామి, వెల్దుర్తిలోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో వైకుంఠ ఏకాదశికి ఏర్పాట్లు చేశారు. జనవరి 2న వైకుంఠ ఏకాదశి సందర్భంగా తెల్లవారుజాము నుంచే భక్తులు స్వామివారిని ఉత్తర ద్వారం ద్వారా దర్శనం చేసుకుంటారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆలయ నిర్వాహకులు ముందస్తు ఏర్పాట్లు చేస్తున్నారు.



కౌడిపల్లి(నర్సాపూర్): వెల్మకన్నలో శ్రీరాయగిరి వేంకటేశ్వరస్వామి ఆలయం



కొల్చారం(నర్సాపూర్): విద్యుత్ దీపాలంకరణలో సంగాయిపేట వెంకటేశ్వరుని గుట్ట

ఘనంగా నూతన సంవత్సర వేడుకలు



కౌడిపల్లి గిరిజన బాలికల మినీ గురుకులంలో విద్యార్థుల సంబరాలు



మెదక్ రూరల్: కుచన్‌పల్లి ప్రభుత్వ పాఠశాల వేడుకల్లో విద్యార్థులు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని వివిధ గ్రామాల్లో ఆదివారం 2023 నూతన సంవత్సరం వేడుకలు యువత, విద్యార్థులు ఘనంగా నిర్వహించుకున్నారు. కొత్త సంవత్సరంలోనికి అడుగు పెట్టగానే కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఇంటి ఎదుట వివిధ రంగులతో కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతూ ముగ్గులు వేశారు. కౌడిపల్లిలోని గిరిజన బాలికల మినీ గురుకులంలో విద్యార్థులకు కేక్ కట్‌చేసి సంబరాలు చేసుకున్నారు.

మెదక్ రూరల్: నూతన సంవత్సర వేడుకలను మెదక్, హవేళీఘనపూర్ మండలాల్లో ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ఆయా గ్రామాల్లో ప్రజలు పాత ఏడాదికి వీడ్కోలు పలుకుతూ కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతూ తమ ఇళ్ల ఎదుట రంగురంగుల ముగ్గులను వేశారు. కుటుంబ సభ్యులు చర్చిలు, ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. పలు పాఠశాలల్లోనూ విద్యార్థులు, ఉపాధ్యాయులు నూతన సంవత్సర వేడుకలను జరుపుకున్నారు.

నిజాంపేట(మెదక్): మండల వ్యాప్తంగా నూతన సంవత్సర వేడుకలను ప్రజలు ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు సోమవారం మండల కేంద్రంలో సీయోను సంపూర్ణ సువార్త మందిరంలో పాస్టర్ వినోద్ కుమార్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రం చేగుంటతో పాటు పలు గ్రామాల్లో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, కొత్త సంవత్సరానికి స్వాగతం పలికారు. మండల కేంద్రంలోని పలు ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలను నిర్వహించారు.

టేక్మాల్(మెదక్): మండలంలోని అన్ని గ్రామాల్లో న్యూ ఇయర్ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. తమ తమ ఇళ్లల్లో కేక్‌లను కట్ చేసి న్యూ ఇయర్ వేడుకలను జరుపుకున్నారు. భక్తులతో ఆలయాన్ని కిటకిటలాడాయి.

చిన్నశంకరంపేట(మెదక్): మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో నూతన సంవత్సర వేడుకలను



చేగుంట(తూప్రాన్): చర్చిలో ప్రార్థనలు చేస్తున్న దృశ్యం

వైభవంగా నిర్వహించారు. చిన్నశంకరంపేటలోని అనంతపద్మానాభస్వామి ఆలయంలో భక్తులు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అంబాజిపేట గ్రామ చర్చిలో చిన్నారులు నృత్యరూపకం ప్రదర్శించారు.

వెల్దుర్తి(తూప్రాన్): మండల వ్యాప్తంగా నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. 2022 సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ 2023 సంవత్సరానికి స్వాగతం పలుకుతూ శనివారం అర్ధరాత్రి 12 గంటలకు కేక్ కట్ చేసి, శుభాకాంక్షలు తెలుపుకున్నారు. తూప్రాన్ డీఎస్పీ యాదగిరిరెడ్డిని ఎస్ఐ మదుసూధన్‌గౌడ్, మండల ప్రజాప్రతినిధులు, నాయకులు, వేర్వేరుగా మర్యాద పూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

చిన్నశంకరంపేట(మెదక్): మండల బీఆర్ఎస్ నాయకుల ఆధ్వర్యంలో మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి కేక్‌కట్ చేశారు. ఆదివారం బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాజు ఆధ్వర్యంలో కేక్ కట్‌చేసి, నూతన సంవత్సర శుభాకాంక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు ఎమ్మెల్యేకు మొక్కను బహుమతిగా అందించారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ మండల అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, సర్పంచ్‌లు యాదగిరి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులున్నారు.

మనోహరాబాద్(తూప్రాన్): మండల కేంద్రం మనోహరాబాద్‌తో పాటు, కాళ్ళకల్, మండలంలోని పారిశ్రామిక వాడల్లో, పలు గ్రామాల్లో నూతన సంవత్సర వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. మహిళలు ముంగిట్లల్లో అందమైన ముగ్గులు వేశారు.

ప్రజాప్రతినిధులకు శుభాకాంక్షల వెల్లువ



సునీతారెడ్డికి పుష్పగుచ్ఛం ఇస్తున్న నయిమోద్దీన్, ఇతర నాయకులు



నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న శివకుమార్, నాయకులు

నర్సాపూర్: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని నియోజకవర్గంలోని నాయకులు ఆదివారం హైదరాబాద్‌కు వెళ్లి ఎమ్మెల్యే, చైర్‌పర్సన్‌లకు శుభాకాంక్షలు తెలిపారు. హైదరాబాద్‌లో రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతారెడ్డి, నర్సాపూర్ మదన్‌రెడ్డిలకు మున్సిపల్ వైస్ చైర్మన్ నయిమోద్దీన్ పలువురు నాయకులతో వెళ్లి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.